కులగణన సర్వే బూటకం

'కులగణన బూటకం.. సర్వే రిపోర్టు అంతా తప్పుల తడక.. కావాలనే బీసీ జనాభా తగ్గించి చూపారు. ఓసీ జనాభా పెరగడం అవాస్తవం. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కాపాడుకునేందుకే ఈ కుట్ర పన్నింది.' అని కాంగ్రెస్ సర్కారు తీరుపై బీసీ సంఘాల నాయకుల ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలు అందరూ ఐక్యంగా పోరాడి హక్కులు కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

- రిపోర్టు మొత్తం తప్పుల తడక
- కావాలనే బీసీ జనాభా తగ్గించారు
- ఓసీ జనాభా పెరగడం అవాస్తవం
- ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కాపాడుకునేందుకే ఈ కుట్ర
- కాంగ్రెస్ సర్కారు తీరుపై బీసీ సంఘాల నాయకుల ఆగ్రహం
- ఐక్యంగా పోరాడి హక్కులు కాపాడుకోవాలని పిలుపు

అగ్రవర్ణాలు అడిన పెద్ద నాటకం..

- ఏ ఉమేశ్, బీసీ సంఘం జిల్లా నాయకుడు

న్యూశాయంపేట, ఫిబ్రవరి 9 : కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన తప్పుల తడకగా ఉంది. ఇది అగ్రవర్ణాలు అడిన పెద్ద నాటకం. ఇటీవల అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో రిజర్వేషన్లు పెంచితే బీసీలకు న్యాయం జరుగుతుందని అనుకున్నాం. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రమైన అన్యాయం చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను అప్పట్లో రేవంత్ రెడ్డి తప్పుబట్టారు. తెలివున్న వాళ్లెవరూ సర్వేలో పాల్గొనబోరంటూ ప్రజలను తప్పుదోవ పట్టించారు. అదే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఇప్పుడు కులగణన చేపట్టి బీసీలు 46 శాతం మందే ఉన్నారంటూ చెబుతుండడం హాస్యాస్పదం.

బీసీ కులగణన రిపోర్ట్ ఫేక్..

- మాడిశెట్టి చంద్రశేఖర్, బీసీ సంఘం నాయకుడు

కమలాపూర్, ఫిబ్రవరి 8 : కాంగ్రెస్ పార్టీ చేపట్టిన బీసీ కులగణన తప్పులతడకగా మారింది. కావాలనే బీసీల సంఖ్యను తగ్గించి చూపించింది. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కాపాడుకునేందుకు ఉన్నత వర్గాలు ఎక్కువగా ఉన్నట్లు చూపారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సి వస్తుందని, బహుజనులను రిజర్వేషన్లకు దూరం చేసేందుకు కుట్ర చేసింది. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి. గత ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో 60శాతం ఉన్న బీసీలు ఎలా తగ్గిపోతారు. రోజు రోజుకూ బీసీల సంఖ్య పెరుగుతుందా? తగ్గుతుందా? కులగణన వందశాతం చేయకుంటే కాంగ్రెస్ పార్టీని బీసీలు బొందపెడుతరు. సమాజంలో అధిక జనాభా కల్గి ఉన్న బీసీలు అన్నింటికి దూరమైపోయింద్రు. బీసీలను అన్యాయం చేసిన పార్టీలను రాబోయే రోజుల్లో వదిలి పెట్టేదిలేదు. బీసీ ప్రజలంతా ఐకమత్యంగా హక్కుల కోసం పోరాడాలి. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే.

తప్పుల తడకగా బీసీ లెక్కలు..

- పోలెపల్లి రామ్మూర్తి, టేకులగూడెం

మడికొండ, ఫిబ్రవరి 9 : కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా బీసీ జనాభా లెక్కలను తప్పుల తడకగా చూపించింది. 61 శాతం ఉన్న బీసీలను 46 శాతంగా చూపించి 15 శాతం బీసీలను బతికి ఉండగానే చంపేసింది. రాష్ట్ర జనాభా నాలుగు కోట్లు ఎప్పుడో దాటితే మూడున్నర కోట్లు మాత్రమే చూపించారు. రాష్ట్రంలో ఓటు హక్కు ఉన్న వారు 3,35,27,925 ఉన్నారు. రాష్ట్ర జనాభా సుమారు 4,48,77,822 ఉండగా ప్రస్తుత లెక్కల ప్రకారం 3,70,77,554 అని చూపించారు. 0-6 పిల్లలు 38,99,000, 6-17 స్కూల్‌కు వెళ్లే పిల్లలు 62,30,504, స్కూల్‌కు వెళ్లని పిల్లలు 16,000, 17-18 మధ్య వయస్సు ఉన్న వారు 15,00,00 ఉండగా పైన తేల్చిన లెక్కలు పచ్చి అబద్ధమని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం బతికి ఉన్న 78,00,000 మందిని లెక్కల్లో తీసుకోలేదు. ఇందులో బీసీ జనాభానే ఎక్కువ. పది శాతం ఉన్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రక్షించుకోవడానికి ఓసీ ముఖ్యమంత్రి, ఓసీ నాయకులు చేసిన కుట్రలో భాగమే ఇది.

బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ సర్కారు

- గండ్రకోట రాజేశ్, బీఆర్ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్

హనుమకొండ, ఫిబ్రవరి 9 : అమలుకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు బీసీలను నమ్మించి మోసం చేసింది. బలహీనవర్గాలకు న్యాయం చేయలేని సీఎం ఉంటే ఎంత? లేకపోతే ఎంత? మన ఓట్లు బీసీ అభ్యర్థులకే వేసి మన హక్కులు సాధించుకోవాలి. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయడంలో ఆలస్యం అవుతుందని గ్రహించిన బీసీలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో కులగణన చేపట్టింది. ఇందులో బీసీల జనాభాను తక్కువ చూపి ఓసీల జనాభా పెరిగినట్లు చూపింది. కులగణన సక్రమంగా జరుగలేదని మొదటి నుంచి బీసీలు ప్రభుత్వానికి వివిధ రూపాల్లో తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే లెక్కలకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన లెక్కలు ఉన్నాయి. ముఖ్యంగా బీసీలు 52 శాతం ఉన్నవాళ్లు ఈ సర్వేలో 46 శాతానికి పడిపోవడం, 7 శాతం ఉన్న ఓసీలు 16 శాతానికి పెరగడం, ఇవన్నీ బీసీలను మరోసారి మోసం చేయడమేనని కండ్లకు కట్టినట్లు కనిపిస్తున్నది. మహనీయుల జయంతి కేవలం ఓటు బ్యాంకు కోసమే చేస్తున్నారని అర్థమవుతున్నది.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

హసన్‌పర్తి, ఫిబ్రవరి 9 : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై రవి కథనం ప్రకారం.. మండలంలోని బైరాన్‌పల్లికి చెందిన వంగనబోయిన రాజయ్య కొంత కాలం నుంచి షుగర్, బీపీతో ఇబ్బంది పడుతున్నాడు. ఎడుమ కాలుకు గాయం కాగా, అది కాస్తా పెద్దగా అయి వేలు తీసేశారు. గాయం బాధ భరించలేక శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి మరొకరు..

నాగేందర్ (ఫైల్)

మహదేవపూర్, ఫిబ్రవరి 9 : చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలోని ఎర్ర చెరువు వద్ద జరిగింది. ఎస్సై కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి గ్రామానికి చెందిన మేడం నాగేందర్(46) తాగిన మైకంలో మండల కేంద్రంలోని ఎర్ర చెరువు వద్ద బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. మృతుడి భార్య మేడం అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

నేడు బల్దియా గ్రీవెన్స్

వరంగల్, ఫిబ్రవరి 9 : గ్రేటర్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అర్జీలు అందజేయాలని కోరారు.

ట్రాఫిక్ సీఐ డ్రైవర్ అత్యుత్సాహం

విద్యార్థిని చితకబాదిన వైనం

నయీంనగర్, ఫిబ్రవరి 9 : ట్రాఫిక్ సీఐ డ్రైవర్ అత్యుత్సాహం ప్రదర్శించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ములుగు జిల్లా గోవిందరావుపేటకు చెందిన బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండలోని మర్కజీ స్కూల్ జంక్షన్ వద్ద శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఆపి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలపై చలాన్లు విధిస్తున్నారు. ఈ క్రమంలో కంప్యూటర్ కోచింగ్ కోసం హనుమకొండకు వచ్చిన విద్యార్థి తన బైక్‌పై పోతున్న క్రమంలో సదరు సీఐ డ్రైవర్ బైక్ ఆపమని చెప్పాడు. ఆపడం కొంత ఆలస్యం కావడంతో వెంటనే కోపోద్రిక్తుడైన సీఐ డ్రైవర్ ఇష్టం వచ్చినట్లు కొట్టినట్లు తెలిపాడు. సార్.. తాము విద్యార్థులమని, చదువుకోవడానికి వచ్చామని, కొట్టకండి అని ఎన్నిసార్లు చెప్పినా వినకుండా ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడుతూ కొట్టినట్లు తెలిపారు. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న సీఐ ఈ ఘటనను చూస్తూ మౌనంగా ఉన్నారని చెప్పాడు.

రైల్వేగేట్‌కు బస్సు తగిలి నిలిచిన రాకపోకలు

కమలాపూర్, ఫిబ్రవరి 9 : మండలంలోని ఉప్పల్ రైల్వేగేట్‌ను ఆర్టీసీ బస్సు తగలడంతో వాహనాల రాకపోకలు గంటపాటు నిలిచిపోయాయి. ఆదివారం పరకాల-హుజూరాబాద్ రహదారిపై ఉన్న రైల్వేగేట్ పడడంతో వాహనాలు నిలిచిపోయాయి. గేట్‌మెన్ రైలు వెళ్లిపోవడంతో గేట్ ఎత్తాడు. గేటు పూర్తిగా తెరుచుకోక పోవడంతో బస్సుకు పైన గేటు తగిలి వంగిపోయింది. దీంతో గేటు పని చేయకపోవడంతో గంటపాటు వాహనాలు నిలిచిపోయాయి. రైల్వేఅధికారులకు సమాచారం అందించడంతో వెంటనే వచ్చి మరమ్మతులు చేసినట్లు ప్రయాణికులు తెలిపారు.

కేయూ పోలీసుస్టేషన్‌లో శ్రమదానం

పోలీసు స్టేషన్‌లో శ్రమదానం చేస్తున్న సీఐ రవికుమార్, సిబ్బంది

నయీంనగర్, ఫిబ్రవరి 9 : పరిసరాల పరిశుభ్రత ద్వారా పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు మరింత ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు కేయూ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ తన సిబ్బందితో కలిసి స్టేషన్‌లో చెత్త తొలగించి శ్రమదానం చేశారు. త్వరలోనే పెద్ద మొత్తంలో మొక్కలు నాటుతామన్నారు.

జాతీయ సదస్సుకు రవికుమార్ హాజరు

భోపాల్ ఎన్సీఈఆర్టీ సదస్సులో పరిశోధనా పత్రాన్ని సమర్పిస్తున్న ఉపాధ్యాయుడు రవికుమార్

ఐనవోలు, ఫిబ్రవరి 9 : రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఎన్సీఈఆర్టీ ఆధ్వర్యంలో భోపాల్‌లో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు జాతీయ సదస్సు జరిగింది. సదస్సులో పంథిని పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు, జాతీయ ఐసీటీ అవార్డు గ్రహీత కోల రవికుమార్ కృత్రిమ మేధను ఏ విధంగా బోధనా పద్ధతిలో అనుసంధానం చేయవచ్చు అనే అంశంపై ఆదివారం పరిశోధనా పత్రం సమర్పించారు. కాగా, ఉపాధ్యాయుడు రవికుమార్‌ను ఎంఈవో ఆనందం, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జయంతి

దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందుండాలి

నయీంనగర్, ఫిబ్రవరి 9 : దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందుండాలని దివ్యాంగుల సంక్షేమ శాఖాధికారి జయంతి అన్నారు. హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల దివ్యాంగుల సాంస్కృతిక ఉత్సవం -2025 ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల కళలు సమాజానికి తెలిసే విధంగా ప్రోత్సాహం అందిస్తున్నదన్నారు. అనంతరం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన దివ్యాంగ క్రీడాకారులకు శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ బన్న ఐలయ్య, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు శ్రీనివాసరావు, ఈవీ శ్రీనివాసరావు, ఫౌండేషన్ అధ్యక్షుడు మహేందర్, తిరుపతి, మాధవి, అనిత, ప్రభాకర్, ప్రవీణ్, హబీబ్, లక్ష్మయ్య, రాంలీలా, కల్యాణ్, కిరణ్మయి, ప్రకాశ్, సుచరిత, నరేందర్, కృష్ణయ్య, శ్రీనివాస్, రవికుమార్, సరిత, రాధిక, స్వరూపారాణి, వాణీరాణి, అనితారాణి, రాజిరెడ్డి, ఉషారాణి, కరుణశ్రీ పాల్గొన్నారు.

బీసీ నాయకుల సమావేశానికి దాస్యం..



తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న దాస్యం, బీఆర్ఎస్ నాయకులు

హనుమకొండ, ఫిబ్రవరి 9 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీసీ నాయకుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్లు, కుల గణన, తాజా రాజకీయ పరిణామాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నినాదాలు చేశారు. సమావేశంలో జిల్లాకు చెందిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, విద్యార్థి విభాగం నాయకుడు వీరస్వామి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దామెర, ఫిబ్రవరి 9 : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 1997-98 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏఎన్ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. పూర్వ విద్యార్థులందరు కలుసుకుని పాఠశాల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంట రాంరెడ్డి, కన్నెబోయిన సారయ్య, గోపాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సతీశ్, జగదీశ్, ఈశ్వరయ్య, వెంకట్‌రెడ్డి, జనార్దన్, ఈశ్వర్‌రావు, ప్రసాద్, గోవిందరాజు, ఆగయ్య, పరిపూర్ణాచారి పాల్గొన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న 1997-98 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

నేటి నుంచి పలు రైళ్లు రద్దు

- 20 వరకు మరికొన్నింటి దారి మళ్లింపు
- రైల్వే అధికారుల వెల్లడి

కాజీపేట, ఫిబ్రవరి 9 : దక్షిణ మధ్య రైల్వేశాఖ సోమవారం నుంచి కాజీపేట రైల్వే స్టేషన్ మీదుగా నడిచే పలు రైళ్లను రద్దు చేసి, మరికొన్నింటి దారి మళ్లించి నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట - విజయవాడ సెక్షన్‌లో ఖమ్మం రైల్వే స్టేషన్ ప్రాంతంలో చేపట్టనున్న మూడో లైన్ రైల్వే ఇంజినీరింగ్ పనుల కారణంగా ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

రద్దయిన రైళ్లు..

కాజీపేట- డోర్నకల్ , డోర్నకల్-విజయవాడ రైల్వే స్టేషన్ల మధ్య ప్రతి రోజూ నడిచే పుష్‌పుల్ రైళ్లు, గుంటూరు- సికింద్రాబాద్, సికింద్రాబాద్- గుంటూరుల మధ్య ప్రతిరోజూ నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, సికింద్రాబాద్-కాగజ్‌నగర్, కాగజ్‌నగర్-సికింద్రాబాద్ మధ్య ప్రతిరోజూ నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు, విశాఖపట్నం- ఎల్‌టీటీ (ముంబాయి) మధ్య నడిచే ఎల్‌టీటీ రైలు 10 నుంచి 20వ తేదీ వరకు, ఎల్‌టీటీ (ముంబాయి) - విశాఖపట్నం మధ్య నడిచే ఎల్‌టీటీ రైలు ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు, గుంటూరు- సికింద్రాబాద్ - గుంటూరు మధ్య నడిచే ఇంటర్‌సిటీ 10, 11, 15, 18, 19, 20వ తేదీల్లో రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే విజయవాడ-సికింద్రాబాద్ - విజయవాడ మధ్య నడిచే శాతవాహన రైలును 11, 14, 16, 18, 19, 20 తేదీల్లో రద్దు చేశారు. షిర్డీ- కాకినాడ మధ్య వారంలో మూడు రోజులు నడిచే కాకినాడ పోర్టు రైలును ఈ నెల 20న, కాకినాడ- షిర్డీ మధ్య నడిచే వారాంతపు కాకినాడ పోర్టు రైలును ఈ నెల 19 న, షిర్డీ- మచిలీపట్నం మధ్య నడిచే వారాంతపు సాయినగర్-షిర్డీ టెర్మినల్ రైలును ఈ నెల 19న, మచిలీపట్నం- షిర్డీ మధ్య నడిచే వారాంతపు సాయినగర్-షిర్డీ టెర్మినల్ రైలును ఈ నెల 20న రద్దు చేశారు.

దారి మళ్లించిన రైళ్లు..

కాజీపేట- విజయవాడ సెక్షన్‌లో నడిచే పలు రైళ్లను సికింద్రాబాద్, పెగడపల్లి, గుంటూరు, విజయవాడ రైల్వే స్టేషన్ల మీదుగా దారి మళ్లించి నడుపుతున్నారు. శాలిమార్-హైదరాబాద్ మధ్య ప్రతిరోజూ నడిచే ఈస్ట్ కోస్ట్ (హౌరా) రైలును ఈ నెల 17, 18, 19వ తేదీల్లో, హైదరాబాద్ -శాలిమార్ మధ్య నడిచే ఈస్ట్ కోస్ట్ రైలును ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు పెదగపల్లి, గుంటూరు మీదుగా దారి మళ్లించారు. ముంబాయి- భువనేశ్వర్- ముంబాయి మధ్య నడిచే కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు, శాలిమార్- సికింద్రాబాద్ మధ్య ప్రతి బుధవారం నడిచే శాలిమార్ రైలును ఈ నెల 19న, ఆదిలాబాద్-తిరుపతి రైల్వే స్టేషన్ల మధ్య ప్రతిరోజు నడిచే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను ఈ 11, 14, 18, 19వ తేదీల్లో దాదాపు గంటన్నర ఆలస్యంగా నడుపుతున్నట్లు తెలిపారు. ఈ సెక్షన్‌లో ప్రయాణించే వారు గమనించాలని రైల్వే అధికారులు కోరారు.

హనుమకొండలో విలేకరులతో మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

- కోటా పెంచిన తర్వాత వర్గీకరణ చేయాలి
- అభ్యంతరాలను స్వీకరించి తుదిజీవో ఇవ్వాలి
- ఉప ఎన్నిక వస్తే సిద్ధంగా ఉంటా..
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వరంగల్, ఫిబ్రవరి 9(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : షెడ్యూల్ కులాల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ల కోటాను పెంచాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీల జనాభా 15 శాతం ఉన్నదని, అందుకే ఆ మేరకు రిజర్వేషన్లు ఇచ్చారని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎస్సీ జనాభా 18 శాతానికి పెరిగిందని, దీని ప్రకారం ఎస్సీల రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలని కోరారు. ఎస్సీలను మూడు గ్రూపులుగా వర్గీకరణ చేయాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై కొన్ని కులాల వారు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను స్వీకరించి, ఆ మేరకు ఎవరికీ నష్టం కలగకుండా ప్రభుత్వం తుది ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. 30 ఏండ్లుగా ఎస్సీ వర్గాలు కోరుకుంటున్న వర్గీకరణ అంశానికి అన్ని ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు ఇస్తూ వచ్చాయని చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పు తర్వాత ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ అనివార్యమైందన్నారు. కడియం శ్రీహరి ఆదివారం హనుమకొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత దేశంలోనే తొలిసారిగా తెలంగాణలోఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తవుతున్నదని చెప్పారు. బీఆర్ఎస్ తరుపున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇస్తే శిరసావహిస్తానని అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉప ఎన్నిక వస్తే తప్పకుండా పోటీలో ఉంటానని, వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. స్టేషన్ ఘన్‌పూర్ ప్రజలు 30 ఏండ్లుగా తనను ఆశీర్వాదిస్తున్నారని, 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలిపించారని అన్నారు. రాష్ట్రంలో అనుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందని, నియోజక వర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ఆహ్వానం మేరకు ఆ పార్టీలో చేరానని తెలిపారు. ఏడాదిలో రూ.800 కోట్ల నిధులు తెచ్చానని, మరో రూ.200 కోట్లు మంజూరు కానున్నాయన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ అయ్యిందని, కొత్తగా కోర్టు ప్రారంభించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మొదటి విడుతలోనే స్టేషన్ ఘన్‌పూర్‌కు మంజూరైందని చెప్పారు. 100 పడకల ఆస్పత్రి, రెవెన్యూ డివిజన్ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్సు, 3,500 ఇందిరమ్మ ఇండ్లు.. వేలేరు, చిల్పూరు మండల కార్యాలయాల కాంప్లెక్సులు, దేవాదుల ప్రాజెక్టు పెండింగ్ పనులు, దేవునూరు గుట్ట ఎకో టూరిజం పార్కు పనులకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని చెప్పారు.

ఉప్పల్ మండలం కోసం ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్షం నాయకులు

మండలం కోసం స్థానిక ఎన్నికలు బహిష్కరిస్తాం

- ఉప్పల్ మండలం కోసం భారీ ర్యాలీ

కమలాపూర్, ఫిబ్రవరి 9 : ప్రభుత్వం దశాబ్దాల కలగా మిగిలిన ఉప్పల్ మేజర్ గ్రామపంచాయతీని మండలంగా ప్రకటించాలని లేదంటే స్థానిక ఎన్నికలు బహిష్కరిస్తామని అఖిలపక్షం నాయకులు హెచ్చరించారు. ఆదివారం ఉప్పల్‌ను మండలం చేయాలని రైల్వేస్టేషన్ నుంచి డప్పుచప్పుళ్లతో గ్రామంలోని తెలంగాణ తల్లి విగ్రహం, జెండా నుంచి భీంపల్లి క్రాస్ రోడ్డు వరకు భారీ ర్యాలీ చేపట్టారు. పరకాల-హుజూరాబాద్ రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా అఖిల పక్షం నాయకులు మాట్లాడుతూ.. అన్ని రకాల వసతులు ఉన్న ఉప్పల్ మేజర్ గ్రామపంచాయతీని ప్రజల ఆకాంక్ష మేరకు మండలం చేయాలని డిమాండ్ చేశారు. మండల ఏర్పాటుతో గ్రామంలోని నిరుద్యోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి దొరుకుతుందన్నారు. మండలం ప్రకటించే వరకు నిరసనలు తెలుపుతూ పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నవీన్‌కుమార్, మాజీ సర్పంచ్ దేవేందర్‌రావు, మాజీ ఎంపీటీసీ సంపత్‌రావు, నాయకులు తోట సురేశ్, రాణాప్రతాప్, కొనుపుల రాంచందర్, మొండెద్దుల రాజమౌళి ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★శ్రీ ఆర్ముఖ బార్ & రెస్టారెంట్ కరీమాబాద్ యందు పనిచేయుటకు వర్కర్లు వెంటనే కావలెను. సంప్రదించగలరు. సెల్ : 8019803598.

NTW-326593

BUILDING FOR SALE

★H.No: 2-6-75, Circuit House, Nakalgutta Hanamkonda, Ground floor Bldg, 160.7 Sq.yds, 1000 sqft RCC buildup area, East Facing, 1.15 Cr. Clear tittle, Brokers pls excuse. **Contact:** 9949912347, 999896 12347, 63025 53816.

NTW-332462

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

- డిప్యుటేషన్లపై వైద్య సిబ్బంది
- శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై వైద్యాధికారుల శీతకన్ను
- కలెక్టర్ ఆదేశాలూ బేఖాతరు

ప్రసవాలపై పట్టింపేది?

శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇదే..

శాయంపేట, ఫిబ్రవరి 9 : శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎలాంటి డెలివరీలు (ప్రసవాలు) జరగడం లేదు. గత నెలలో ప్రతి పీహెచ్‌సీలోను నార్మల్ ప్రసవాలు జరగాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. ఈ క్రమంలో శాయంపేట పీహెచ్‌సీలో మాత్రం ఇందుకు అనుగుణంగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. పీహెచ్‌సీలో ఉండాల్సిన డాక్టర్, హెల్త్ అసిస్టెంట్ డిప్యుటేషన్‌పై వెళ్లి వేరేచోట పనిచేస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి పీహెచ్‌సీలో ఒక్కటైనా ప్రసవం జరగాలని సూచించారు. కానీ శాయంపేట ఆరోగ్య కేంద్రంలో మాత్రం దీనికి భిన్నంగా జరుగుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. 24 పంచాయతీలకు ప్రధాన కేంద్రంగా ఉన్నది శాయంపేట ఆరోగ్య కేంద్రం. గతంలో ఇక్కడ ప్రతి రోజుల సాధారణ ప్రసవాలు జరిగేవని గుర్తు చేస్తున్నారు. అర్ధరాత్రి వరకు వైద్యులు ఉండి వైద్యసేవలు అందించారని అంటున్నారు. కానీ కొంతకాలంగా సాయంత్రం 4 గంటల వరకే వైద్యులు వెళ్లిపోతున్నట్లు చెబుతున్నారు. సాయంత్రం వేళల్లో ఆస్పత్రిలో ఒక్కరూ ఉండడం లేదు. దీంతో పాము కాటు, కోతులు, కుక్కల దాడుల్లో గాయపడినా వైద్యం అందని ద్రాక్షగా మారిందని ఆవేదన చెందుతున్నారు. సాయంత్రం 4గంటలు ఎప్పుడు అవుతుందా? ఎప్పుడు వెళ్లిపోదామా? అన్నట్లుగానే ఆస్పత్రిలో వైద్యుల తీరు ఉందంటున్నారు. ఈ క్రమంలో కలెక్టర్ ఆదేశాలనూ పాటించడం లేదంటున్నారు. తమ డ్యూటీ 4గంటల వరకే అని వైద్యాధికారి చెప్పి వెళ్లిపోతుండడం ఉన్నతాధికారులకు తెలిసినా ఏం పట్టించుకోని పరిస్థితి ఉందంటున్నారు. వైద్య సేవలను సాధ్యమైనంత ఎక్కువ అందించేందుకు వైద్యాధికారులు కృషి చేయాల్సి ఉన్నది. కానీ ఇక్కడ మాత్రం టైమ్‌కు వెళ్లిపోతున్న పరిస్థితి ఉంది. ఈనేపథ్యంలో నార్మల్ ప్రసవాలపై పట్టించుకున్న దాఖలాలు లేదంటున్నారు. అసలు సాయంత్రం ఒక్క వైద్య సిబ్బంది ఉండడం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రసవాలు ఎలా జరుగుతాయి? వీళ్లను పట్టించుకునేది ఎవరు? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వైద్యం సరిగ్గా అందకపోవడంతో గర్భిణులు రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. వైద్యం సక్రమంగా అందకపోవడంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇక్కడ పని చేయాల్సిన డాక్టర్, హెల్త్ అసిస్టెంట్ ఇద్దరు కొన్నేండ్లుగా డిప్యుటేషన్‌లో వేరే చోట పనిచేస్తున్నారు. మరీ వీరిని ఎందుకు ఇక్కడికి తీసుకురావడం లేదు? వైద్య సేవలను విస్తృతం ఎందుకు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. డిప్యుటేషన్లపై ఉన్న వారికే అధికారులు అండగా నిలుస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇక్కడ పనిచేసే వారిని ఇక్కడికి తీసుకొస్తే వైద్యం సేవలు మరింత అందే అవకాశం ఉందని ప్రజలు కోరుతున్నారు.